
# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశాలకు విస్తృత ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 02న జిల్లాలో నియోజకవర్గ స్థాయిలో సమావేశాలను అట్టహాసంగా నిర్వహించేలా విస్తృత ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.

శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ అమలు, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ, ధాన్యం సేకరణ, డివిజనల్ స్థాయిలో ప్రజావాణి నిర్వహణ అంశాలపై సమీక్ష నిర్వహించారు.

వీ.సీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులతో సమావేశం నిర్వహించి, పై అంశాల అమలు తీరుపై సూచనలు చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చివరి వరకూ పక్కాగా అమలు చేయాలని సూచించారు. గ్రామ, మండల స్థాయి తరహాలోనే శనివారం నాటి నియోజకవర్గ స్థాయి సభలను కూడా విజయవంతంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉదయం వేళలోనే సభలు నిర్వహించాలని సూచించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ స్థాయి సభను శ్రీ రామా ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ సభను నడిపల్లి వద్ద గల జీ. కన్వెన్షన్ లో, ఆర్మూర్ నియోజకవర్గ స్థాయి సభను సప్తగిరి ఫంక్షన్ హాల్ లో, బోధన్ నియోజకవర్గ స్థాయి సభను ఆచన్ పల్లి లోని ఏ.ఆర్ గార్డెన్ లో నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 4 నుండి 9వ తేదీ వరకు రైతు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఇదిలాఉండగా, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ సక్రమంగా కొనసాగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీలు, రవాణా, గోనె సంచుల సరఫరా, హార్వెస్టర్ యంత్రాల వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సకాలంలో ధాన్యం సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం దోహదపడుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రెవెన్యూ డివిజన్ స్థాయిలో సబ్ కలెక్టర్, ఆర్డీఓల నేతృత్వంలో ప్రతీ సోమవారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు స్వీకరించిన నెల రోజులలోగా పరిష్కరించాలని, తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలతో దరఖాసుదారుకు సమాచారం అందించాలని అన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల సంబంధిత వివరాలను పోర్టల్ లో నమోదు చేసి రసీదు అందించాలని, దరఖాస్తుదారులు ప్రజావాణి పోర్టల్ లో తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చని అన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి వచ్చే ప్రజలకు త్రాగునీరు, కుర్చీలు, అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.

ఈ నెల 3వ తేదీన జరగనున్న నీట్ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ విధానం ద్వారా తీసుకోవడం జరుగుతుందని, పరీక్ష కేంద్రంలోనికి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అనుమతించడం జరగదని, పరీక్ష రాసే అభ్యర్థుల తనిఖీ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.

జనగణన ప్రక్రియకు సంబంధించి, ఈ నెల 10వ తేదీ వరకు జరగనున్న స్వీయ గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వీయ నమోదు చేసుకునేలా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు స్వీయ గణన చేసుకుని, తమ శాఖ సిబ్బంది సైతం చేసుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు, యువత కూడా స్వీయ గణన చేసుకునేలా అవగాహన కల్పించాలని, టామ్ టామ్, దినపత్రికలు, ఛానల్ ద్వారా ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. 33 ప్రశ్నలకు సరైన సమాధానం అందించాలని, స్వీయ గణన ప్రక్రియ అనంతరం వచ్చిన సంఖ్యను భద్రపరచుకుని గణన అధికారులు ఇంటికి వచ్చిన సమయంలో అందించేలా ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్ డీపీఓ శ్రీనివాస్ రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మే-డే స్ఫూర్తితో మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

### సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి రామకృష్ణ





సిరికొండ, బతుకమ్మ : మే-డే స్ఫూర్తితో మోడీ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం 140వ మేడే దినోత్సవ సందర్భంగా మండలం లోని గడ్కోల్ గ్రామంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ - ట్రేడ్ యూనియన్ సెంటర్ అప్ ఇండియా (టియుసిఐ) ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎర్రజెండా ను పార్టీ గ్రామ కార్యదర్శి ఎం లింబాద్రి ఎగరవేశారు. ఈ రామకృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ శ్రామిక ప్రజల సంఘీబావ దినోత్సవమే మేడే అని , పెట్టుబడిదారీ వ్యవస్థను అంతం చేసే మే-డే స్ఫూర్తిని ప్రపంచ శ్రామిక ప్రజలకు అందించాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా శ్రామిక ప్రజలు తమ హక్కుల కోసం పోరాటం చేస్తూ శ్రమ దోపిడి నుండి శాశ్వత విముక్తి లక్ష్యంతో చికాగో కార్మికులు పోరాడి విజయం సాధించిన రోజే ఈ మేడే అని అన్నారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని కారల్ మార్క్స్ , ఏంగెల్స్ ఇచ్చిన పిలుపును దేశ దేశాల్లోని కార్మికులు అందుకొని కార్మిక వర్గ పోరాటాలు నిర్వహించారన్నారు. మేడే స్ఫూర్తిని అందుకొని ముందుకుపోయిన అనేక దేశాలు అభివృద్ధిని సాధించాయని అన్నారు. సోషలిస్టు విప్లవాలు, జాతి విముక్తి పోరాటాలు నిర్వహించి విజయవంతమైన పోరాటాలు అనేకం ఉన్నాయని అన్నారు. కానీ నేడు ప్రపంచీకరణ పేరుతో సామ్రాజ్యవాద దోపిడీ తీవ్రతరం అయిందని, కార్మికుల హక్కులపై ప్రభుత్వాలు ఉక్కు పాదాన్ని మోపుతున్న ఈ క్రమంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అని సేవకు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేడు భారత్ లో మోడీ ప్రభుత్వం అనుసరించే కార్మిక వ్యతిరేక విధానాల అమలును ప్రతిఘటిస్తూ, అమెరికా యుద్ధోన్మాద చర్యలు ప్రపంచ పీడిత ప్రజలకు,వెనుకబడిన దేశాలకు తీవ్ర ముప్పు అని, ప్రపంచ శాంతి కోసం ప్రజలు ముందుకు వచ్చి పోరాడాలని మే-డే స్ఫూర్తిని ప్రజలు అందుకొని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టి యు సి ఐ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్ రమేష్ ప్రసంగించగా సిపిఐ(ఎం ఎల్) మాస్ లైన్, టియుసిఐ నాయకులు బి బాబన్న, ఆర్ దామోదర్, బి కిషోర్, ఎం నారగౌడ్, బి సర్పంచ్, ఎస్ కిశోర్, ఎం అనిస్,పి ఎల్లయ్య, కె రాంజీ, ఎస్ గంగాధర్, ఎస్ అక్షయ్, కె ఆశిస్, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి సన్మానం

ఎల్లారెడ్డి, బతుకమ్మ :ఇటీవల విడెదలైన 10వ తరగతి ఫలితాల్లో ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తాండకు చెందిన గిరిజన విద్యార్థినీ సభావాట్ హారిక 564/600 మార్కులు సాధించింది. గ్రామపంచాయతీలో అత్యున్నత మార్కులు సాధించిన హారికకు వారి తల్లిదండ్రులకు శుక్రవారం హాజీపూర్ తండా స్థానిక సర్పంచ్ రతన్, పంచాయతీ కార్యదర్శితో పాటు వార్డు సభ్యులు శాలులతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. హారిక విజయాలు కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రోత్సహించిన తల్లిదండ్రులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రతన్, ఉపసర్పంచ్ శివరాములు, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు అనుష, నరేష్, రవీందర్, గ్రామపంచాయతీ సిబ్బంది సుభాష్, మోతీరామ్, శ్రీను తండావాసులు తదితరులు పాల్గొన్నారు.



## మేడే పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిద్దాం

### వేల్పూర్ భూమయ్య




నిజామాబాద్ రూరల్, బతుకమ్మ :మేడే పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిద్దామని వేల్పూర్ భూమయ్య అన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో 140 వ మేడే వార్షికోత్సవం సందర్భంగా బోర్గం పి లో న్యూ డెమోక్రసీ జెండాను మోపాల్ మండల నాయకులు ముత్యాల నారాయణ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం నర్సింపల్లి గ్రామంలో స్వతంత్ర జెండా ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య ఐఎఫ్ టియు నాయకులు మల్లికార్జున్, అగ్గు చిన్నయ్య కార్మికులకు మేడే శుబాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరిన మాజీ మావోయిస్ట్ వనజక్క



హైదరబాద్, బతుకమ్మ:మాజీ మావోయిస్టు పటేల్ వనజక్క తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. శుక్రవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కండువా కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. అనంతరం పటేల్ వనజ ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా మల్లన్న నియమించారు. పటేల్ వనజ మావోయిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ మెంబర్ అమరుడు పటేల్ సుధాకర్ రెడ్డి సతీమణి అనే విషయం తెలిసిందే.

## అమరవీరుల స్ఫూర్తితో మేడే ఉత్సవాలు విజయవంతం



భిక్కనూరు, బతుకమ్మ:అమరుల స్ఫూర్తితో మేడే ఉత్సవాలు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కొత్త నరసింహులు మేడే జెండాను ఆవిష్కరించారు. ప్రజా సంఘాల అయిన సిఐటియు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం జరుపుకొని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా పాత చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్, ఆటో యూనియన్ అధ్యక్షులు లింగం, భూపతి, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భరోసా స్వచ్ఛంద సేవ సంస్థ ఆర్థిక సహాయం



వేల్పూర్, బతుకమ్మ : 2004-2005 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున వేల్పూర్ గ్రామా నికి చెందిన మంగళి హ రీష్ రూ. 15,000 ఆర్థిక సహాయం అందించారు. హరీష్‌కు ఇటీవల బ్రెయిన్ సర్జరీ జరిగిన విషయం తెలిసిందే. కాగా ఆయన తన వృత్తి పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలతో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. అయితే, కడుపేదరికంలో ఉన్న ఆయనకు హఠాత్తుగా ఆరోగ్య సమస్య రావడంతో ఆయన కుటుంబ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు గురి అయ్యారని తెలుసు కున్న భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు వెంటనే స్పందించి, హరీ ష్ కుటుంబానికి తమ వంతుగా ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు గజేందర్, సురేష్, బాలు, మహిపాల్ ఇతర తదితరులు పాల్గొన్నారు.